క్లుప్తంగా

నేటి నుంచి 'కంటివెలుగు'

పరకాల : నేటి (సోమవారం) నుంచి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కంటివెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పరకాల మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెలమవాడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈనెల 24 వరకు కంటి వెలుగు సేవలు కొనసాగుతాయని తెలిపారు. పట్టణ పరిధిలోని 18 ఏళ్లకుపైబడ్డ ప్రజలందరూ కంటివెలుగు కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి అద్దాలు, మందులు ఇవ్వడంతోపాటు శస్త్ర చికిత్స సైతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు.

ఆర్థికసాయం

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన మంద రాములు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతుండగా గంగిరేణిగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో అతడితోపాటు టెన్త్ చదువుకున్న మిత్రులు ఆదివారం రూ.50 వేలు సాయం అందజేశారు. తనకు సాయం చేసిన మిత్రులకు రాములు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లాల్‌సింగ్, గుగులోతు కృష్ణ, షాబుద్దీన్, నాగరాజు, శ్యామ్, సందీప్, శివరాజు, వినోద్, వినయ్, ప్రకాష్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో తనిఖీ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన బీఎల్ఐసీ పరీక్షలు జరుగుతున్నాయి. కాగా, పరీక్ష కేంద్రాన్ని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.శ్రీనివాస్ ఆదివారం సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి తనిఖీచేశారు.

ప్రాతినిథ్యం కల్పించాలి

ఖిలా వరంగల్ : వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు చట్టసభల్లో ప్రాతినిథ్యం కల్పించాలని, ఈక్రమంలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి సీసీఐ చేసిన తీర్మాన పత్రాన్ని అందజేయనున్నట్లు కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుందర్శన్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యలను చట్టసభలో ప్రశ్నించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల వినియోగదారుల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేయూత

హసన్‌పర్తి: నగరంలోని అతిథి ఆశ్రమానికి బీఆర్ఎస్ నాయకుడు సహకారం అందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసారి తన జన్మదిన వేడుకలను అనాధాశ్రమాల్లో జరుపుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తోట నాగరాజు, చకిలం చంద్రశేఖర్, నంది శ్రీనివాస్, సూర సతీష్, శివారెడ్డి, మూల దేవేందర్, శ్రవణ్, నిర్వాహకురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓస్ కాలనీ అభివృద్ధికి కృషి

కాజీపేట రూరల్: 64వ డివిజన్ మడికొండ శివారులోని టీఎన్జీఓస్ కాలనీ అభివృద్ధికి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సహకారంతో తనవంతు కృషి చేస్తానని డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్ అన్నారు. టీఎన్జీవోస్ కాలనీ ఏర్పాటై 30 ఏళ్లు కావస్తున్న సందర్భంగా కాలనీ సమస్యలపై శ్రీకాంత్‌కు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెట్టం సాంబయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మడికొండ పట్టణ శాఖ అధ్యక్షుడు రమేష్, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు అన్నదానం

వరంగల్: నగరంలోని ఆటోనగర్ కొత్తవాడలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపునేని సంజీవరావు, కళ, సరోజన, సుభద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో పెగడపల్లికి చెందిన చిన్నదామెర శాంతమ్మ మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కొంరెల్లి తదితరులు పాల్గొన్నారు.

మార్నేని రవీందర్‌రావుకు..

కాజీపేట రూరల్: డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును కాజీపేట బీఆర్ఎస్ నాయకులు ఆయన స్వగృహంలో ఆదివారం కలిసి పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు రవీందర్‌రావు కాలికి బలమైన గాయం కాగా, ఈమేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. కార్యక్రమంలో నాయకులు సిరిల్ లారెన్స్, మర్యాల కృష్ణ, గోల్కొండ రాంబాబు, ఎండి.మతిన్, సతీష్ పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రతిష్ఠాపనోత్సవాలు

కమలాపూర్ : మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ ధర్మశాస్తా సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఉదయం కలిశ గణపతి పూజ, పుణ్యాహవాచనం, గర్తన్యాసం, రత్నన్యాసం, దాతున్యాసం, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దిక్బంధనం, దిష్టికుంభం, కళాన్యాసములు, నేత్రోన్మీలనం, బలిహరణ, నిత్య హోమాలు, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, అర్చన, అలంకరణ, గణపతి, కుమారస్వామి, ధ్వజస్తంభ శిఖర సహిత శ్రీ అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి దర్శనాలు, మహా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మహా దివ్య పడిపూజ నిర్వహించి భక్తులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమాల్లో ఆలయ శాశ్వత ధర్మకర్త, గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు, భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు శేషాచార్యులు, అర్చకులు లక్ష్మణమూర్తి, హరీశాచార్యులు, విజయశేఖరాచార్య, తిరువేంగళాచార్యులు, విగ్రహాల దాత ఇజ్జిగిరి సంపత్‌కుమార్–దేవేంద్ర, ధ్వజస్తంభ దాత చల్లూరి రమేష్, శిఖర కలశాల దాత గువ్వాడి సదానందం, పదునెట్టాంబడికి తాపడం, టైల్స్ దాతలు 1998–99 ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, అన్నదాత దేశిని అయిలయ్యగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నేరెళ్ల అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల రాజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండపెల్లి మల్లారెడ్డి, కోశాధికారి రామగిరి శ్రీధర్, డైరెక్టర్లు జక్కు కృష్ణమూర్తిగౌడ్, మాటం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పూజలు

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై సతీష్

భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

శ్రీ అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలను పురస్కరించుకుని భారతి సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్సై సతీష్ చేతుల మీదుగా భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ కంపెనీ మేనేజర్ నాగేశ్వర్‌రావు మాట్లాడారు. కంపెనీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి, శ్రీ వాసని ఏజెన్సీస్ డీలర్ భూపతి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరకాలను కమ్మేసిన పొగమంచు


పొగమంచులో పరకాల రహదారి


నడికూడలో..

పరకాల : అసలే ఆదివారం.. కూరగాయల వ్యాపారులు, కార్మికులు సంతకు వేళవుతున్న సమయంలో పరకాలను పొగమంచు కమ్మేసింది. ఉదయం 6 గంటకు ప్రారంభమైన పొగమంచు 8 గంటల వరకు ఉండడంతో వాహనదారుల పరుగులకు బ్రేక్ పడింది. పొంగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనపడక పలువురు వాహనదార్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారినా వాహనదార్లు వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణించిన పరిస్థితి చోటు చేసుకుంది. వాహనదారులను ఇబ్బంది పెట్టిన పొగమంచుతో పట్టణ ప్రజలు ముచ్చటపడడం గమనార్హం.

నడికూడ : మండల కేంద్రంలో, పల్లెల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాహనాలకు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

కెపాసిటర్లు వాడాలి : డీఈ



భీమదేవరపల్లి : వ్యవసాయ బావులకు అమర్చే విద్యుత్ మోటార్ పంపుసెట్లకు తప్పకుండా కెపాసిటర్లు వాడాలని ట్రాన్స్‌కో డీఈ సామ్యా నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని మాణిక్యాపూర్ గ్రామంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లను ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు కెపాసిటర్లు వాడడంతోపాటు ఐఎస్ఐ గుర్తింపు పొందిన మోటార్లనే బిగించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ శిరీష్‌కుమార్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కమలాపూర్ : మండలంలోని లక్ష్మీపూర్, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీపూర్‌లో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి, మర్రిపల్లిగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న బోయ (వాల్మీకి) సంఘం షెడ్ నిర్మాణానికి, రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, రూ.10 లక్షలతో చేపట్టిన గౌడ సంఘం కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు చెరిపెల్లి వనిత, ఇనుగాల కిరణ్మయి విజయ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, మాజీ సర్పంచ్ ఏలిమి కుమారస్వామి, నాయకులు పింగిలి ప్రదీప్‌రెడ్డి, మోహన్‌రావు, పొరండ్ల రమేష్ పాల్గొన్నారు.


గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

'ఏసీడీ'తో వినియోగదారులపై భారం

- విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

పరకాల : ఏసీడీ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ విమర్శించారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కరెంట్ కోతలు, ఏసీడీ చార్జీలకు నిరసనగా పట్టణంలోని విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఎండిపోయిన వరికొయ్యలతో రైతులతో కలిసి ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. అనంతరం ఏఈ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ చార్జీల పేరిట పెనుభారం మోపుతోందని మండిపడ్డారు. విద్యుత్ కోతలు విధిస్తూనే దోపిడీకి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని, కరెంట్ కోతలతో రైతులను ఇబ్బందుల పాలు చేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, మాజీ ఎంపీపీ ఓంటేరు రాముర్తి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అలీ, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్, నాయకులు పంబం శ్రీనివాస్, ఏకు రవికుమార్, రాకేష్, సదన్‌కుమార్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


ఎండిపోయిన వరికొయ్యలతో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

జాతీయస్థాయి అథ్లెట్లకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 7 వ తేదీ నుంచి బిహార్‌లోని పాట్నాలో జరగనున్న 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు వెళనున్న వరంగల్, హనుమకొండ జిల్లాల క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఆవరణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుబేదారి పోలీస్ ఇన్‌స్పెక్టర్ షకూర్ హాజరై క్రీడాకారులకు కిట్లను అందజేసి మాట్లాడారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు రూ.పదివేల నగదు పారితోషకం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వరదరాజేశ్వర్‌రావు, మూగల కుమార్, కృష్ణమూర్తి, పీఈటీలు రజనీకాంత్, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట మహాశివరాత్రి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట రూరల్: కాజీపేట మండలం మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయంలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈమేరకు కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ మహా శివరాత్రికి కావాల్సిన ఏర్పాట్లకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ. భారతి, కార్పొరేటర్ మునిగాల సరోజన, చైర్మన్ దువ్వ నవీన్, డివిజన్ ప్రెసిడెంట్ వినోద్ పాల్గొన్నారు.

17న జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

ఖిలా వరంగల్: ఈనెల 17న తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకుడు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపునూత శ్రీనివాస్ కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని ఎమ్మెల్యే నరేందర్ క్యాంప్ కార్యాలయం వద్ద అసోసియేషన్ ప్రతినిధులు, కార్పొరేటర్ కుమారస్వామి, పసుపు నూత శ్రీనివాస్‌తో కలిసి వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తౌటం రంజిత్, కడారి సదానందం, పేరాల మల్లేశం, రాజ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ఆలయాల అభివృద్ధి

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర : బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఆలయాల అభివృద్ధి జరుగుతోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని పసరగొండలో శివాలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గత పాలకులు తెలంగాణలోని ఆలయాలను విస్మరించారని విమర్శించారు. స్వరాష్ట్ర సాధన అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని చెప్పారు. శివాలయ నిర్మాణానికి తాను వ్యక్తిగతంగా సహకరించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా చొరవ తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, ఎంపీటీసీ శనిగరం కళ సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రజనీకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, సీనియర్ నాయకులు సదిరం పోశయ్య, దుర్శెట్టి భిక్షపతి, పరికరాల మధు, అమ్మ రమేష్, నల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆలయ భూములు ఆక్రమిస్తే శిక్షార్హులు : ఈఓ

హన్మకొండ కల్చరల్: దేవాలయాల భూములను ఆక్రమిస్తే దేవాదాయ ధర్మాదాయశాఖ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని భద్రకాళి ఆలయం ఈఓ కె.శేషుభారతి హెచ్చరించారు. పెద్దమ్మగడ్డలోని కేఎస్ఆర్ గార్డెన్స్ వెనుక భాగంలో సర్వే నంబర్ 479లోని మూడెకరాల భూమి భద్రకాళి దేవాలయానికి అనుబంధ దేవాలయమైన సీతారామచంద్రస్వామి దేవాలయానికి (చిన్నకొవెల) సంబంధించినదని పేర్కొన్నారు. కాగా, ఆ భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు జెండాలు పాతడంతో దేవాదాయ శాఖ సిబ్బందితో కలిసి దేవస్థాన భూములను ఈఓ శేషుభారతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శేషుభారతి మాట్లాడుతూ ఆలయ భూముల్లో పాతిన జెండాలను తొలగించాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని ఈఓ అన్నారు.

పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలి

హసన్‌పర్తి: ఇంటర్ దశలో విద్యార్థులు పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. మండలంలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఏకశిల జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను అధ్యాపకులు వెలికితీయాలని చెప్పారు. ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రణాళికతో క్రమశిక్షణతో కూడిన విద్యను ఏకశిలలో అందిస్తున్నట్లు వివరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్లు బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజారెడ్డి, ముచ్చు జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్.రాజిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

ధర్మసాగర్ : ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. మండలంలోని క్యాతంపల్లిలో క్తొగా చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, నారాయణగిరిలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి, ముప్పారం, ధర్మపురం గ్రామాల్లో ఓడీసీఎంఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ×మన ఊరు-మన బడి× కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పిన్నపురెడ్డి అవనిజరెడ్డి, కర్ర సోమిరెడ్డి, గోనెల సమ్మక్క, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు

ఎల్కతుర్తి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆ పార్టీ జిల్లాస్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం రెండో రోజుకు చేరుకోగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయవాదం, మతం పేరుతో వైషమ్యాలను రెచ్చగొడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ఎన్నికల హామీ ఏమైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో నెట్టే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్, ఆహార భద్రతకు సబ్సిడీ తగ్గించినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం బడా, కార్పొరేట్ పారిశ్రామిక వేత్తలైన అదానీ, అంబానీ లాంటి వాళ్లకే లబ్ధి చేకూర్చేలా ఉందని చెప్పారు. బడ్జెను అంకెల గారడీగా అభివర్ణించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు కట్టించాలని, ధరణి పోర్టల్‌లో అవసరమైన సవరణలు చేసి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదారి శ్రీనివాస్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, కామెర వెంకటరమణ, బాషబోయిన సంతోష్, నిమ్మల మనోహర్, మొండయ్య, సదానందం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హేమంతరావు

పేస్కేల్ అమలుకు చొరవ చూపండి

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం తమకు పేస్కేల్ అమలు చేసేలా చొరవ చూపాలని కోరుతూ వీఆర్ఏల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు ఎమ్మెల్యే ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో అమలయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి అవిశ్రాంతంగా పని చేస్తున్నామని తెలిపారు. అయినా తమకు కేవలం రూ.10,500 వేతనం మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. చాలీచాలని వేతనంతో కుటుంబాలను పోషించుకోలేక అష్టకష్టాలు పడుతున్నామని ఆందోళన వెలిబుచ్చారు. కుటుంబ పోషణ భారమై పలువురు వీఆర్ఏలు ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పేస్కేల్ అమలు చేస్తామని, 55 ఏళ్లకు పైబడ్డ వారి వారసులకు ఉద్యోగాలకు కల్పిస్తామని, అర్హులకు పదోన్నతులు కల్పిస్తామని పలుమార్లు హామీ ఇచ్చినా విస్మరించారని తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు పేస్కేల్ అమలు చేయడంతోపాటు ఇతర హామీలు నెరవేర్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు దుంపల సతీష్, గౌరవ అధ్యక్షుడు మొట్ల సారయ్య, ఉపాధ్యక్షుడు దాసరి రంజిత్, ప్రధాన కార్యదర్శి ఉడుతనబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

వేడుకగా సమ్మక్క–సారలమ్మ మినీ జాతర


భీమదేవరపల్లి : పూజలు చేస్తున్న సురేందర్‌రెడ్డి


ఆత్మకూరు : పూజ చేస్తున్న పూజారులు, భక్తులు


భీమదేవరపల్లి : మండలంలోని ముల్కనూర్‌లో మినీ సమ్మక్క–సారలమ్మ జాతర ఆదివారం వేడుకగా సాగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, ఊసకోయిల ప్రకాశ్, దొంగల కొంరయ్య, పైడిపల్లి పృథ్వీరాజు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి, అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా, సర్పంచ్ మాడ్గుల కొంరయ్య, ఎంపీటీసీ రమేష్, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అగ్రంపహాడ్‌లో..

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్‌లోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో ఆదివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. దేవతలకు బోనాలు సమర్పించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పూజారులు సాంబశివరావు, గోనేల సారంగపాణి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు ఉద్యోగభద్రత కల్పించాలి

పరకాల : తమకు కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక మునిసిపాలిటీ ఆర్పీలు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు అమరావతి, కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడారు. సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్థాపించినప్పటి నుంచి పని చేస్తున్నామని తెలిపారు. వీఎల్ఆర్, స్త్రీనిధి నిధుల నుంచి గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనలను తొలగించి ప్రభుత్వ వేతనం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పాత ఆర్పీలను యదావిధిగా కొనసాగించడంతోపాటు ప్రతినెలా వేతనాలు రూ.18 వేలు చొప్పున అందించేలా చూడాలని, ఐడీ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సాంబయ్య, ఉమాదేవి, స్వప్న, శీల, జయప్రద పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ధర్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274